# ప్రజా [illegible]

## తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 23 | శుక్రవారం 18 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2




తెలంగాణకు భారీ వర్ష సూచన.. ఐదు రోజుల పాటు దంచికొట్టనున్న వానలు!

## తెలంగాణ గడ్డ స్వభావం
# అన్యాయాన్ని ఎదిరించడం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అంతకు ముందు గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించిన రేవంత్ రెడ్డి
- సెప్టెంబరు 17ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది
- ఈ సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు
- సామాజిక న్యాయమే పునాదిగా పాలన అందిస్తున్నామన్న సీఎం
- రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు



**హైదరాబాద్ :** తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని అభివర్ణించారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించిందని తెలిపారు. సెప్టెంబరు 17వ తేదీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ తెలంగాణ గడ్డ స్వభావమని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందని, నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ - మిగతా 2 లో




## తెలంగాణలో పట్టభద్రుల
# ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల
- మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ
- సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

**హైదరాబాద్ :** తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం- - మిగతా 2 లో

## చరిత్రకు మతం
# రంగు పులిమే ప్రయత్నం జరుగుతోంది



- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- సెప్టెంబర్ 17 సందర్భంగా జెండా ఆవిష్కరించిన కవిత
- కాంగ్రెస్, బీజేపీలపై కవిత విమర్శలు
- విలీన చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపణ
- మతాలకు అతీతంగా ప్రజలు పోరాడారని వెల్లడి

**హైదరాబాద్ :** తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సెప్టెంబర్ 17ను - మిగతా 2 లో

## హైదరాబాద్ విలీనం కోసం మహనీయులు
# బలిదానాలు చేశారు




- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది
- ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు
- పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించారు
- అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు.

**హైదరాబాద్ :** మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. 1947 ఆగస్టు 15 నుంచి జాతి నిర్మాణం కోసం పోరాటం మొదలైందని తెలిపారు. హైదరాబాద్ విముక్తి కోసం 1948లో ఆపరేషన్ పోలో చేపట్టారని, పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి మహనీయులు బలిదానాలు చేశారని స్మరించుకున్నారు. హైదరాబాద్ విముక్తిలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషి ఎంతో ఉందని, అది బలమైన భారత్ నిర్మాణానికి దోహదం చేసిందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ - మిగతా 2 లో

## మోదీ ప్రసంగాల్లో
# జెన్-జీ స్లాంగ్



- ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ
- యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం
- 'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం
- ఎస్‌ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన
- యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ

**ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే - మిగతా 2 లో

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం



- కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం
- రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన - మిగతా 2 లో

## మావోయిస్ట్ అగ్రనేత లొంగుబాటు

- రూ.2.20 కోట్ల రివార్డు ఉన్న అగ్రనేత లొంగుబాటు
- మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అసిమ్ మండల్ లొంగుబాటు
- జార్ఖండ్, ఒడిశాలలో కలిపి ఇతనిపై రూ.2.20 కోట్ల రివార్డు
- పలు హింసాత్మక ఘటనల్లో కీలక పాత్ర పోషించిన అసిమ్
- మండల్ నుంచి కీలక సమాచారం రాబట్టేందుకు అధికారుల ప్రయత్నం

2 లో..

## తిరుమల చేరుకున్న
# ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

- తిరుమల పర్యటనకు విచ్చేసిన ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్
- నేడు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్న గవర్నర్
- తిరుమలలో గవర్నర్‌కు స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్, ఈవో
- రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం తిరుమల చేరుకున్నారు. శ్రీవారి దర్శనార్థం తిరుమల విచ్చేసిన ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గవర్నర్ నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారు. గురువారం సాయంత్రం తిరుమలలోని శ్రీభాగ్య విశ్రాంతి భవనానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎం. రవిచంద్ర, సీవీఎస్‌వో మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్, రిసెప్షన్ అధికారులు భాస్కర్, సాత్రే - మిగతా 2 లో

## కాశీలో చంద్రబాబు
# 'వి.కె.ఎస్.' మంత్రం

- వాగ్ధాటితో అదరగొట్టిన ఏపీ సీఎం చంద్రబాబు
- వారణాసిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో చంద్రబాబు
- మోదీ పాలనను వివరిస్తూ 'వి.కె.ఎస్.' మంత్రాన్ని ఆవిష్కరించిన సీఎం
- కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రసంగానికి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక అభినందనలు
- ఎన్డీఏ బంధం చెక్కుచెదరదని, ఏపీకి అండగా నిలిచారని స్పష్టీకరణ



**అమరావతి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసిలో నిర్వహించిన 'కాశీ-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో సభికులను ఉత్తేజపరిచారు. ప్రధాని మోదీ పాలన, దార్శనికత, దేశానికి అందిస్తున్న సేవలను వివరిస్తూనే, ఆంధ్రప్రదేశ్‌తో కేంద్ర ప్రభుత్వ బంధాన్ని బలంగా చాటిచెప్పారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించడం, ప్రసంగం ముగిశాక "వెరీ వెల్... వెరీ వెల్" అంటూ ప్రశంసించడం సభలో అందరి దృష్టినీ ఆకర్షించింది. చంద్రబాబు తన ప్రసంగాన్ని హర హర మహాదేవ్ అంటూ ఆధ్యాత్మిక కోణంలో ఆరంభించడం విశేషం. ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వివరిస్తూ చంద్రబాబు 'వి.కె.ఎస్.' అనే సరికొత్త మంత్రాన్ని ఆవిష్కరించారు. "వి అంటే మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్, కె అంటే ఆయన కర్మభూమి అయిన కాశీ, ఎస్ అంటే ఆయన జన్మించిన సెప్టెంబర్ 17. ఈ 'వి.కె.ఎస్.' మంత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత - మిగతా 2 లో

# సంపాదకీయం

## బ్రిటన్‌లో వేర్పాటు భేరి!



బ్రిటిష్ వలస పాలకులు తాము తప్పుకున్న మరుక్షణం భారత్ చిన్నాభిన్నం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పుడు ఆ దేశమే ముక్కలయ్యే స్థితి ఏర్పడింది. మొన్న సోమవారం స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌లు(మన దగ్గర సీఎంల హోదాతో సమానం) అనధికార సమావేశం జరిపి, తమ స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తం చేసే ప్రకటనపై సంతకాలు చేశారు. దేశం కలిసుండాలా, విడిపోవాలా అనేది... అందుకు అనుసరించాల్సిన పద్ధతేమిటన్నది లండన్‌లోని జాతీయ పార్లమెంటు మాత్రమే నిర్ణయించాల్సిన అంశం కాబట్టి, ఇప్పటికప్పుడు దీనివల్ల జరిగేదేమీ ఉండదు. కానీ ఆర్థిక సంక్షోభాలు అగ్రరాజ్యాల్ని సైతం ఎలా కుదిపేస్తున్నాయో చెప్పడానికి తాజా పరిణామం ఉదాహరణ. అమెరికాపై పాతికేళ్లనాడు ఉగ్రదాడి జరిగినప్పుడు 3,000 మందిని పొట్టనబెట్టుకోవడం మినహా ఆ ఉగ్రవాదులు సాధించిందేమిటన్న ప్రశ్న వినబడింది. అటు తర్వాత అమెరికా సవ్యంగావుంటే ఉగ్రవాదం అంతరించేది. కానీ జరిగిందంతా అందుకు భిన్నం. అప్పట్లో అందరినుంచీ అమెరికాకు మద్దతు లభించింది. కొత్తగా అధికారంలోకొచ్చిన రష్యా అధినేత పుతిన్ అమెరికా ప్రారంభించిన 'ఉగ్రవాదంపై యుద్ధా'నికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తాలిబన్ల వేటకు మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ సైనిక స్థావరాల వినియోగానికి ఉదారంగా అనుమతించారు. నాటో ఆవిర్భవించి అప్పటికి యాభైయ్యేళ్లు దాటగా... అందులోని మొదటి క్లాజు 'సమష్టి రక్షణ'ను తొలిసారి ఉపయోగించి ఆ సంస్థ అమెరికాకు బాసటగా నిలిచింది. ఇలా చిన్నా పెద్దా దేశాలన్నీ తాలిబన్‌ల వేటకు తోడ్పడ్డాయి.కానీ దీన్ని అమెరికా దుర్వినియోగం చేసింది. మానవహక్కుల ఉల్లంఘన సంగతలా వుంచి ఇరాక్ మొదలు పలు దేశాలపై విరుచుకుపడి ధ్వంసరచనకు, మారణహోమాలకు పాల్పడింది. లక్షల కోట్ల డాలర్లను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసింది. ప్రతీకారేచ్ఛ క్రమంలో తాను దివాలా తీస్తున్నాననీ, నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నాననీ, చైనాపై కన్నేసి వుంచాలన్న సంగతి మరిచాననీ గ్రహించలేక పోయింది. ఉగ్రదాడికి ముందు మిగులు బడ్జెట్‌లో ఉన్న అమెరికా ఇప్పుడు 40 లక్షల కోట్ల డాలర్లకుపైగా అప్పుల్లో కూరుకుపోయింది. కరోనా మహమ్మారి పాత్ర కూడా ఇందులో ఉండొచ్చు గానీ... విచక్షణారహిత యుద్ధాల పరంపరే దాన్ని ఈ స్థితికి చేర్చింది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు యుద్ధాల్లో పాలుపంచుకున్న నాటో బలహీన పడింది. అన్ని దేశాలూ ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఈ కష్టాల పరంపరనుంచి గట్టెక్కటం కోసమే ఆరేళ్ల క్రితం ఈయూ నుంచి బ్రిటన్ బయటికొచ్చింది. బ్రెగ్జిట్ రిఫరెండమ్‌లో దీన్ని నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రజానీకం తిరస్కరించారు. కానీ వారి అభీష్టానికి విలువ లేకుండాపోయింది. ఇప్పుడు బ్రిటన్‌నుంచి విడిపోవటంతోపాటు ఈయూలో చేరటం కూడా ఈ ముగ్గురు అధినేతల ఎజెండా. చారిత్రకంగా మన రాష్ట్రాల కన్నా వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ భిన్నమైనవి. వేల్స్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ ఆక్రమించుకుంది. రాచరికాలు చుట్టరికం కలుపుకోవటంతో స్కాట్లాండ్,ఇంగ్లండ్ కలిసి ప్రయాణించి వందేళ్ల తర్వాత కలిసి 1703లో గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో దానిలో చేరిన ఐర్లాండ్ 1921లో విడిపోయింది. కానీ ఉత్తర ప్రాంతంలోని ఆరు కౌంటీలు యూకేలోనే కొనసాగుతామన్నాయి.బ్రిటన్ తప్పుడు నిర్ణయాలతో అన్ని ప్రాంతాలనూ భ్రష్టు పట్టించటంతోపాటు, వాటి అధికారాలను కుదిస్తూవచ్చింది. పన్నుల ఆదాయాన్ని సరిగా పంచక 90 దశకం చివర్లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తి హోదాకు ముప్పు తెస్తోందన్నది వాటి అభిప్రాయం. నిరుద్యోగం, జనాభా క్షీణతపై తమకు సరైన నిర్ణయాధికారాలు లేవని వాటి ఫిర్యాదు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడైనా సక్రమంగా వ్యవహరించటం చేతకాకపోతే అవి మరింత ముదురుతాయి. ఫెడరల్ వ్యవస్థను నీరుగార్చి ప్రశాంతంగా మనుగడ సాగించా లనుకోవటం చెల్లదని బ్రిటన్ పాలకులు గుర్తించకపోతే... ఇప్పటికి కేవలం రాజకీయ హెచ్చరికగానే తలెత్తిన ఈ నిరసన ఆ ప్రాంత జనాభాను తాకడానికి ఎన్నాళ్లో పట్టదు. అప్పుడు బ్రిటన్ లండన్‌గా మిగిలిపోక తప్పదు. చేసిన పాపాలు శాపాలై వెంటాడ తాయంటారు. మనతో సహా అనేక దేశాలను పీల్చిపిప్పిచేసిన బ్రిటన్ ఇప్పుడు ఇల్లు చక్కదిద్దుకోగలదా అన్నది వేచిచూడాలి.

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

**మొదటిపేజీ తరువాయి -** జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## తిరుమల చేరుకున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

**మొదటిపేజీ తరువాయి -** నాయక్ తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు, రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

## చరిత్రకు మతం రంగు పులిమే ప్రయత్నం జరుగుతోంది

**మొదటిపేజీ తరువాయి -** పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు, త్యాగాల చరిత్రకు నిదర్శనమన్నారు. అయితే ఈ చారిత్రక రోజును కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నాయని విమర్శించారు.తెలంగాణ విలీనానికి స్టేట్ కాంగ్రెస్ పోరాటమే కారణమని సీఎం చెబుతున్నారని, అది వాస్తవం కాదని కవిత అన్నారు. సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని అప్పట్లో మహాత్మా గాంధీ చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిజాం ప్రభుత్వం పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని భారత యూనియన్‌లో విలీనం తర్వాత కాంగ్రెస్ తిరిగి జమీందార్లకు అప్పగించిందని ఆరోపించారు.బీజేపీ తీరుపైనా కవిత మండిపడ్డారు. ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా ఆనాటి చరిత్రకు మతం రంగు పులిమేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆ పోరాటం జరిగిన సమయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉనికిలోనే లేవని అన్నారు.జాగీర్దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాటం చేశారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి వారు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని గుర్తుచేశారు.కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినుద్దీన్ వంటి కవులు, రచయితలు తమ రచనలతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారని చెప్పారు. వారి స్ఫూర్తితో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వంటి వారు పోరాటంలో ముందుకు వచ్చారని పేర్కొన్నారు.అదే స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన కూడా కులమతాలకు అతీతంగా ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని కవిత అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు అంతం పలికే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# కాశీలో చంద్రబాబు 'వి.కె.ఎస్.' మంత్రం

**మొదటిపేజీ తరువాయి -** శక్తివంతమైనది. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఎవరైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోదీ నిరూపించారు" అని చంద్రబాబు అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముతూ, కష్టపడి చదువుకుని దేశ ప్రధాని స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "మోదీ పాలనలో 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు, 4 కోట్ల మందికి గృహ వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ఆయన కల. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు" అని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడటమే కాకుండా, 100 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.రక్షణ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ నేడు మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సెమీకండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీ వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న ఏకైక నేత మోదీ" అని కొనియాడారు. స్టార్టప్‌ల ద్వారా యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగిందని, మహిళా సాధికారతకు -బేటీ బచావో- నుంచి -లఖ్‌పతి దీదీ- వరకు అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.తన ప్రసంగంలో భాగంగా ఆయన అయోధ్య రామజన్మభూమి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించి, రామ మందిర కలను సాకారం చేశారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి "నేను చెప్పింది నిజమే కదా?" అని ప్రశ్నిస్తూ, అందరితో "జై శ్రీరామ్" అని గట్టిగా నినాదాలు చేయించారు. దీంతో వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ ఒక్కసారిగా ఆ నినాదాలతో మార్మోగింది.ఈ సందర్భంగా చంద్రబాబు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. "నేను పవిత్రమైన తిరుమల శ్రీ బాలాజీ కొలువైన నేల నుంచి వచ్చాను. ఈ చారిత్రక కాశీ నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. దీని కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరుతున్నాను" అని అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుంచి భారీ స్పందన లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం చరిత్రాత్మకమని, వారసత్వ సంపదను కాపాడుతూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మోదీకే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు.ఎన్డీఏ కూటమి బంధం విడదీయరానిదని చంద్రబాబు స్పష్టం చేశారు. "అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. సహకార సమాఖ్య స్ఫూర్తి మాకు కేవలం నినాదం కాదు, అది మా రోజువారీ అనుభవం. మేం కలిసే ఉన్నాం, భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం. మన ఐక్యతే దేశానికి బలం" అని పునరుద్ఘాటించారు. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం దేశానికి లభించిన గొప్ప అదృష్టమని, ఆ నాయకుడే నరేంద్ర మోదీ అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. ఆయన ప్రసంగానికి సభికులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

## మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్

**మొదటిపేజీ తరువాయి -** స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది .ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ'లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని,



ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు.ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు.ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం.సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

## తెలంగాణ గడ్డ స్వభావం అన్యాయాన్ని ఎదిరించడం

**మొదటిపేజీ తరువాయి -** స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అణచివేతలు చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోల పరిచాయని గుర్తు చేశారు.భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడిందని, నిజాం ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు రగిలాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని అన్నారు. రావి నారాయణ రెడ్డి, భీంరెడ్డి నర్సింహా రెడ్డి, చాకలి ఐలమ్మ వంటి యోధులు పోరాటాలకు నాయకత్వం వహించడం గొప్ప విషయమన్నారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు నెహ్రూ, పటేల్ నాయకత్వంలో సైనిక చర్య చేపట్టారని వివరించారు.తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించింది. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం. - సీఎం రేవంత్? రెడ్డిఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత ప్రభుత్వానికి లొంగిపోయినట్లు సీఎం తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైందన్నారు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం సెప్టెంబరు 17వ తేదీ అని గుర్తుచేశారు.సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి, ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడుతోందని చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలుగా ఉందని, దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం ఇది అధికమని అన్నారు.కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నామని, పెండింగ్ ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని సీఎం చెప్పారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలని, ఆర్థిక స్వావలంబన సాధించాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రకటించారు. ప్రతి కుటుంబం ఆత్మ గౌరవంతో జీవించాలనేది తమ ప్రభుత్వ ఆశయమన్నారు. హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్లు గుర్తు చేశారు.

# మావోయిస్ట్ అగ్రనేత లొంగుబాటు



**మొదటిపేజీ తరువాయి -** మావోయిస్టు పార్టీకి పెను దెబ్బ తగిలింది. సీపీఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ సభ్యుడైన అసిమ్ మండల్ అలియాస్ ఆకాశ్ పశ్చిమ బెంగాల్‌లో లొంగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇతనిపై జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలు భారీ మొత్తంలో రివార్డులు ప్రకటించాయి. జార్ఖండ్ ప్రభుత్వం ఇతని తలపై రూ.1 కోటి రివార్డు ప్రకటించగా, ఒడిశా ప్రభుత్వం రూ.1.20 కోట్లు రివార్డు ప్రకటించింది. మొత్తం మీద ఇతనిపై రూ.2.20 కోట్ల రివార్డు ఉంది.పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మేదినీపూర్ జిల్లా, చంద్రకోన పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉత్తర ఫుల్‌చక్ గ్రామ నివాసి అయిన అసిమ్ మండల్.. మావోయిస్టు పార్టీలో ఆకాశ్, తిమిర్, మనోజ్, దీపక్, రాకేశ్ వంటి పలు పేర్లతో కార్యకలాపాలు సాగించాడు. ముఖ్యంగా జార్ఖండ్‌లోని కోల్హాన్, సారండా ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా మావోయిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఇతని లొంగుబాటును జార్ఖండ్ పోలీసులు కూడా ధృవీకరించారు.జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇతనిపై సుమారు 55 తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో చాలా వరకు భద్రతా బలగాలపై దాడులు, ఎన్‌కౌంటర్లకు సంబంధించినవే. 2026 మార్చి 1న చైబాసాలోని మరంగ్‌పొంగ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కోబ్రా 209వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్‌తో సహా ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడటంలో ఇతని పాత్ర ఉంది. అలాగే, 2025 ఏప్రిల్ 12న రాధాపోర వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక జార్ఖండ్ జాగ్వార్ జవాన్ మరణించాడు.ఇవేకాక, 2023 జనవరి 11న టోంటో పోలీస్ స్టేషన్ పరిధిలోని తుంబాహాక అటవీ ప్రాంతంలో జరిగిన ఐఈడీ పేలుడులో 9 మంది కోబ్రా బెటాలియన్ సిబ్బంది గాయపడ్డారు. 2020 మే 31న జోన్వాలో, 2018 జులై 11న ఝూటీ పహారీలో జరిగిన దాడుల్లో చెరొక భద్రతా సిబ్బంది మరణించారు. ఈ ఘటనలన్నింటిలోనూ అసిమ్ మండల్ కీలక సూత్రధారిగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.ప్రస్తుతం అసిమ్ మండల్‌ను అదుపులోకి తీసుకున్న భద్రతా ఏజెన్సీలు.. మావోయిస్టుల నెట్‌వర్క్, ఆయుధ నిల్వలు, రహస్య స్థావరాలపై కీలక సమాచారం రాబట్టేందుకు విచారిస్తున్నాయి. ముఖ్యంగా సారండా అడవుల్లో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాల గురించి ఇతని ద్వారా కీలక సమాచారం లభించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

## హైదరాబాద్ విలీనం కోసం మహనీయులు బలిదానాలు చేశారు

**మొదటిపేజీ తరువాయి -**

శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి మీద పాట రూపంలో అద్భుతమైన కార్యక్రమం నిర్వహించారు. నృత్య రూప ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.తెలంగాణ విమోచన దినోత్సవ వట్టడుకలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ నిజాం అద్భుత పాలన చేశాడన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న వేళ అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు శోచనీయమని నిప్పులు చెరిగారు. నిజాం అంత మంచొడైతే వందేమాతరం రాంచందర్‌రావు, భాగ్యరెడ్డి వర్మ, బండి యాదగిరి, కోదాటి నారాయణ రావు, రాంజీగోండు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, ముఖ్దుం మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, ప్రభాకర్‌రావు, కుమురం భీం, బోమ్మగాని ధర్మభిక్షం గౌడ్, సుద్దాల హనుమంతు, నారాయణరావు పవార్ వంటి యోధులు ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నిజాం మీద భారత ఆర్మీ ఎందుకు యుద్ధం చేసిందో చెప్పాలని అన్నారు. రాజకీయాలు, అధికారం కోసం ఎంతకైనా దిగజారుతామనే విధంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందని విమర్శించారు."భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి మహనీయులు బలిదానాలు చేశారు. మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. 1947 ఆగస్టు 15 నుంచి జాతి నిర్మాణం కోసం పోరాటం మొదలైంది. హైదరాబాద్ విముక్తి కోసం 1948లో ఆపరేషన్ పోలో చేపట్టారు. హైదరాబాద్‌ను విముక్తి చేయడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషి ఎంతో ఉంది" -రాధాకృష్ణన్, ఉపరాష్ట్రపతిఅసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిజాం గొప్ప వాడని పొగుడుతున్నారని, ఇలాంటి వారి డీఎన్ఏను పరీక్షించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. తెలంగాణ చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలియజెప్పే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అవినీతి, ఆరోపణలు లేకుండా పాలన చేస్తుందని వివరించారు. తెలంగాణలో మార్పు కోసం రాష్ట్ర ప్రజలు ఆలోచించాలన్నారు.13 నెలలు ఆలస్యంగా తెలంగాణ గడ్డకు స్వాతంత్ర్యం వచ్చిందన్న బండి సంజయ్, రాష్ట్ర ప్రజలపైన జరిగిన మారణకాండను పాలకులు 80 ఏళ్లుగా తొక్కి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్లీస్‌కు భయపడి, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రజాకార్ల దౌర్జన్యాలను దాచి పెట్టారని అన్నారు. రజాకార్ల సంస్థ 1940లో ప్రారంభించి హిందువులు, దేవాలయాలపై దాడులు చేశారని తెలిపారు. తెలుగు అనాగరిక భాష అని నిషేధించి పరభాష అయిన ఉర్దూను మన మీద రుద్దారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాంను పొగడటం సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. నిజాం గొప్పవాడైతే చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, రావి నారాయణ రెడ్డి వంటి వారు ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. నిజాం మంచోడు అయితే తెలంగాణ గ్రామ గ్రామన ఎందుకు బురుజులు కట్టుకున్నారో సీఎం చెప్పాలని నిలదీశారు.నిజాం పోయిన ఆయన వారసత్వమైన మజ్లీస్ పార్టీ అరాచకాలు సృష్టిస్తోందని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 1980 నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేస్తూ వస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐదేళ్లుగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 2029లో బీజేపీ ప్రభుత్వ ఆధ్యర్యంలో తెలంగాణలో ప్రతి గ్రామ గ్రామాన అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది.ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.



ప్రజా మంటలు
శుక్రవారం 18 - 09 - 2026

## గాంధీ వైద్య కళాశాలలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 17 ( ప్రజా మంటలు):** సికింద్రాబాద్ గాంధీ వైద్య కళాశాలలో కు గురువారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనపై కులమతాలకు అతీతంగా సాగించిన సాయుధ పోరాట ఫలితంగానే 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు విముక్తి లభించిందని గుర్తుచేశారు. ఆ మహత్తర చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహిస్తోందని ఆమె తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు భావితరాలకు ఎల్లప్పుడూ ఆదర్శనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ రాజారామ్, డాక్టర్ నాగమోహన్ రావులతో పాటు ప్రొఫెసర్లు డాక్టర్ సుధారాణి, డాక్టర్ శ్రీనివాస్, ఏడీ శ్రీనివాస్, ఏవో సుబ్బారావు, ఎంపీహెచ్ఈవో వేణుగోపాల్ గౌడ్, ఫిజికల్ డైరెక్టర్ వేణు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారి జన్మదిన వేడుకలు.





**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 17 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** భారతీయ జనతా పార్టీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం మరియు భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. బాయి లింగ రెడ్డి మాట్లాడుతూ రజాకార్ల పాలనా నుండి విముక్తి పొందినమని ఆ పోరాటం లో సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి పోరాటం తెలంగాణ ప్రజలు ఎప్పటికి మర్చిపోరని అన్నారు, దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారు సుపారీ పాలనా అందిస్తూ ప్రపంచంలో శక్తి వంతమైన నాయకుడిగా నిలిచారాని మంచి ఆరోగ్యం తో దేశాన్ని ఇంక ముందు తీసుకువెళ్తారని అన్నారు,ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శులు పంతగి వెంకటేష్ యాదవ్, సుంచు రణధీర్, జిల్లా నాయకులు తిగేలా శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుండేటి సతీష్, సెక్రటరీ అశోక్, కోశాధికారి శేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షులు బోడ నవీన్ రెడ్డి, దర్మిక సెల్ మండల కన్వీనర్ బండి గోపాల్,బూత్ అధ్యక్షులు మారుతీ, మహేందర్,జితేందర్,నాయకులు రంజిత్, శశి, నర్సింహా, వెంకటేష్, సంజయ్, గౌతమ్,మధు తదితర నాయకులు పాల్గొన్నరు,

## జడ్పీహెచ్ఎస్ వర్షకొండలో సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాము



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 17 (ప్రజా మంటలు దగ్గుల అశోక్) :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్షకొండ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ప్రధానోపాధ్యాయులు బి రాజేందర్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పొనుకంటి వెంకట్ మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం విద్య కోసం అధిక నిధులు ఖర్చు చేస్తూ ప్రాధాన్యాన్ని ఇస్తున్నట్టుగా తెలిపారు విద్యార్థులంతా ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాలను సక్రమంగా వినియోగించుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో అసువులు బాసిన అమరులకు నివాళులు అర్పించారు. ఉప సర్పంచ్ జయ మాట్లాడుతూ ఈ గ్రామంలో తెలంగాణ కోసం జరిగిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫాం లు పంపిణీ చేశారు. 15 సెప్టెంబర్ నుండి అక్టోబర్ రెండు వరకు జరిగే స్వచ్ఛతహి సేవ ప్రతిజ్ఞను విద్యార్థుల చేత చేయించారు. విద్యార్థులకు స్వీట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆవుల శ్రీనివాస్ జలంధర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇమ్మానుయేల్, మాధురి, స్వామి, సుజాత, మల్లికార్జున్, నరేందర్ పాల్గొన్నారు.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీల బాదుడును ఉపసంహరించాలి

**సికింద్రాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ దీపక్ జాన్**



**సికింద్రాబాద్,సెప్టెంబర్ 17 ( ప్రజామంటలు):** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం యూపీఐ లావాదేవీలపై తీసుకొచ్చిన కొత్త విధానాన్ని నిరసిస్తూ సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన నిర్దిష్ట వాణిజ్య లావాదేవీలపై 0.4 శాతం మేర 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) విధించడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శ్రేణులు గళమెత్తాయి.ఈ సందర్భంగా సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ మాట్లాడుతూ.. వ్యాపార యూపీఐ లావాదేవీలపై మోపిన ఈ అదనపు భారాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికాకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, అగ్రరాజ్య ఒత్తిళ్లకు మోదీ ప్రభుత్వం తలొగ్గిందని ఆయన ధ్వజమెత్తారు. దేశ ప్రయోజనాల పరిరక్షణలో ప్రధానికి దృఢచిత్తం కొరవడిందని విమర్శించారు.యూపీఐ లావాదేవీలపై పన్ను విధించడం వల్ల చివరకు ఆ భారం వ్యాపారుల ద్వారా సామాన్య వినియోగదారులపైనే పడుతుందని, నిత్యావసరాల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని దీపక్ జాన్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల జేబులకు చిల్లు పెట్టి విదేశీ శక్తులకు మేలు చేసేలా ఉన్న ఈ నూతన విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎంపీ మల్లు రవితో పాటు డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ



**జగిత్యాల సెప్టెంబర్ 17 (ప్రజా మంటలు):** ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్‌కు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్, లైబ్రరీ చైర్మన్ దినేష్, అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, రాజా గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గట్టు సతీష్, కౌన్సిలర్లు ప్రశాంత్ రావు, బాలముకుందం, దుమల రాజ్‌కుమార్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవం ఘనంగా నిర్వహణ

**బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ**

**మోదీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పండ్ల పంపిణీ**

**-- శివాలయంలో ప్రత్యేక పూజలు**





**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 17: ప్రజా మంటలు :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మూడు రంగుల జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఆనాటి రజాకార్ల అరాచకాలు, ప్రజలపై జరిగిన అక్రమాలు, తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో జరిగిన పోలీస్ చర్య ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, హక్కులు, ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, యువతకు ఈ చారిత్రక విషయాలను వివరించాలని నాయకులు పిలుపునిచ్చారు.మోదీ జన్మదిన వేడుకలు అనంతరం భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు, కార్యకర్తలకు పండ్లను పంపిణీ చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ గారు దేశ అభివృద్ధి, ప్రజాసేవలో చేస్తున్న కృషిని గుర్తుచేసుకుంటూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మోదీ గారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**ఎల్కతుర్తి శివాలయంలో ప్రత్యేక పూజలు**

తదుపరి ఎల్కతుర్తి శివాలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని, దేశ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, దేశం మరింత అభివృద్ధి చెందాలని శివుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మహిళా మోర్చా నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వారు: జిల్లా కార్యవర్గసభ్యులు కుడుతాడి చిరంజీవి, పల్లెపాటి మధుకర్. మండల ప్రధాన కార్యదర్శులు అల్లి కుమార్, చీదురాల వెంకటేష్, , ఉపాధ్యక్షులు అభిరు శ్రీనివాస్, వేల్పుల శ్రీనివాస్, కడారి ప్రసాద్, కానుకుంట్ల రమణాచారి, కార్యదర్శులు కోడం రమేష్, చిర శ్రీనివాస్, మాటూరి విద్యాసాగర్.హింగే దేవరావు.సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, మూషిక వెంకటేష్, ఆడెపు శ్రీవర్ధన్, నాంపల్లి అశోక్, సల్వాల కిరణ్, దండ దేవేందర్ రెడ్డి, ఎడ్ల రఘోతం రెడ్డి, ఠాకూర్ శామ్ సింగ్, నార్లగిరి వెంకటేష్.సుఖినే సుధాకర్, కొమ్మిడి లచ్చిరెడ్డి, మంతుర్తి సమ్మయ్య, పోలు భిక్షపతి, ఉడుత సూర్యనారాయణ, మాజీ సర్పంచులు బూర్గుల రామారావు, భాస్కరరావు, కొమ్మిడి నిరంజన్ రెడ్డి,చల్ల రవీందర్ రెడ్డి.తక్కల్లపల్లి సంపత్ రావు, గణబోయిన నాగరాజు, పోలు నరేష్, చందా రామకృష్ణ, నార్లగిరి వెంకటేష్.గొర్రె ప్రవీణ్, సాతూరి ప్రభాకర్, చీరాల రంజిత్, ఎన్. మాధవరావు, మాచర్ల తిరుపతి, నారెడ్ల శంకర్, సతీష్, నగేష్, కిరణ్, నమ్మిండ్ల ప్రవీణ్, సందేలా మధు, వడ్లకొండ రమేష్, గూడెం నాగరాజు, వెల్దండి రాజేందర్, పోలు శివ, జేయందర్, గూడెల్లి శ్రీనివాస్. బొజ్జ కృష్ణం రాజు.మడిపల్లి కొమురయ్య.తదితరులు పాల్గొన్నారు.మహిళా మోర్చా నాయకులు: మమత, స్వాతి, కడారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## చిన్నారి అక్షర యోధురాలికి ఉపరాష్ట్రపతి ప్రశంసలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 17 (ప్రజా మంటలు):** బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని, అక్షరాస్యత ఉద్యమకారిణి ఆకర్షణ సతీష్ (15) భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 'హైదరాబాద్ విమోచన దినోత్సవ' వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతితో ఆమె సుమారు 10 నిమిషాల పాటు ప్రత్యేకంగా ముచ్చటించారు. 'ది ఓపెన్ లైబ్రరీస్' వ్యవస్థాపకురాలైన ఆకర్షణ, సమాజంలో పఠనాసక్తిని పెంచేందుకు ఇప్పటివరకు 19,000కు పైగా పుస్తకాలతో 25 గ్రంథాలయాలను ఏర్పాటు చేసిన తన స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు.చిన్న వయసులోనే అక్షరాస్యత విస్తరణ కోసం ఆకర్షణ చూపుతున్న అంకితభావాన్ని ఉపరాష్ట్రపతి కొనియాడారు. సమాజానికి సేవ చేస్తూనే, భవిష్యత్తులో తాను ఎంచుకున్న రంగంలో మరింత ఉన్నతంగా రాణించాలని, లైబ్రరీల ఏర్పాటును నిరంతరం కొనసాగించాలని ఆమెను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. తొమ్మిదేళ్ల ప్రాయంలోనే గ్రంథాలయాల ఏర్పాటును చేపట్టిన ఆకర్షణ, ఇటీవల తన 25వ ఓపెన్ లైబ్రరీని న్యూఢిల్లీలోని ఆర్మీ హాస్పిటల్ (రీసెర్చ్ ఉ రెఫరల్)లో సాయుధ దళాల కుటుంబాల కోసం ప్రారంభించారు. తనపై నమ్మకంతో విలువైన సమయం కేటాయించిన ఉపరాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపిన ఆకర్షణ, ఈ భేటీ తన బాధ్యతను మరింత పెంచిందని, మరింత మంది చిన్నారులకు పుస్తకాలను చేరువ చేసేందుకు ఇది కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

## విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల, సెప్టెంబర్ 17 (ప్రజా మంటలు):** విశ్వకర్మ జయంతి సందర్భంగా జగిత్యాల పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షులు గాజెంగి నందయ్య స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జెండా ఆవిష్కరించి విశ్వకర్మ బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. పట్టణ స్వర్ణకార సంఘంలో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 75వ సారి రక్తదానం చేసిన కనపర్తి రవిని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డా.రాజగొ పాల చారి, బొందుకూరి స్రీనివాస్, కౌన్సిలర్లు జుంబర్తి గంగా లక్ష్మి రాజ్ కుమార్, పంబాల సుజాత రామ్ కుమార్, సంఘం కార్యవర్గ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మున్సిపల్ లో జాతీయ పతాకావిష్కరణ



**జగిత్యాల, సెప్టెంబర్ 17:** ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో పాలన అందించాల్సిన బాధ్యతను ప్రజా పాలన దినోత్సవం గుర్తుచేస్తుందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజా పాలన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను స్థానికంగా సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు జగిత్యాల పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, పరిశుభ్రత, మౌలిక వసతుల మెరుగుదలకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకే కాదు-పెద్దలకూ వ్యాక్సిన్లు తప్పనిసరి

**మెడికవర్ ఆసుపత్రి వైద్యుల సూచన..**



**సికింద్రాబాద్,సెప్టెంబర్ 17 ( ప్రజామంటలు):** వ్యాక్సినేషన్ అనేది కేవలం చిన్నారులకే పరిమితం కాదని, పెద్దలు కూడా వయసు, ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన టీకాలు తీసుకోవాలని సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు సూచించారు. గురువారం ఆసుపత్రిలో ప్రత్యేకంగా 'అడల్ట్ వ్యాక్సినేషన్ డ్రైవ్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు స్వయంగా మీడియా సమక్షంలో ఫ్లూ వ్యాక్సిన్ తీసుకుని, పెద్దలు వేయించుకున్న టీకాల వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా 'అడల్ట్ ఇమ్యునైజేషన్ కార్డు'ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ప్రదీప్ కుమార్ మిశ్రా, డాక్టర్ గంగాధర్ రెడ్డి మల్లు, డాక్టర్ వినయ్ కుమార్ రతన్, డాక్టర్ వాలూరి పద్మిని మాట్లాడారు. చిన్నతనంలో వేయించుకున్న వ్యాక్సిన్లు పెద్దయ్యాక కూడా పూర్తిస్థాయిలో రక్షణ ఇవ్వలేకపోవచ్చని, ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన వారు, గుండె, శ్వాసకోశ, దీర్ఘకాలిక సమస్యలున్నవారు ఫ్లూ, న్యూమోకోకల్ వ్యాక్సిన్లు తీసుకోవాలని తెలిపారు. అలాగే మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో కీలకమని, నవజాత శిశువులను ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడేందుకు కుటుంబ సభ్యులందరూ టీకాలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ రాజీవ్, సెంటర్ హెడ్ కృష్ణవేణి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం లో జాగ్రత్తలు పాటించాలి

**ఎస్ఐ, కృష్ణ సాగర్ రెడ్డి**



**గొల్లపల్లి సెప్టెంబర్ 17 ప్రజా మంటలు :** వినాయక నిమజ్జనం అనేది ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంతో జరుపుకునే వేడుక. అయితే ఈ సమయంలో చిన్నపాటి అజాగ్రత్త పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది. కాబట్టి నిమజ్జనానికి వెళ్లేటప్పుడు భక్తులు, నిర్వాహకులు ఖచ్చితంగా కొన్ని కీలకమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ,కృష్ణ సాగర్ రెడ్డి అన్నారు.విగ్రహాన్ని వాహనంపై తీసుకెళ్లేటప్పుడు దారిలో ఉన్న కరెంట్ తీగలను గమనిస్తూ ఉండాలని అవసరమైతే విద్యుత్ శాఖ అధికారుల సహాయం తీసుకోవాలన్నారు.వాహనాలపై ఉన్నవారు ఇనుప రాడ్లు, కర్రలతో విద్యుత్ తీగలను తాకకూడదని విగ్రహాన్ని ఉంచిన వాహనంలో లేదా ట్రాక్టర్లలో పరిమితికి మించి భక్తులు ఎక్కకుండా చూసుకోవాలని తెలిపారు.ముఖ్యంగా వాహనం అంచులపై కూర్చోవడం ప్రమాదకరమన్నారు.చెరువులలో నిమజ్జనం చేసేటప్పుడు నీటి లోపలికి వెళ్లే ప్రయత్నం చేయకూడదన్నారు.

## తెలంగాణ వీయెచన దినోత్సవం సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో జెండా ఆవిష్కరణ



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 17 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి: తెలంగాణ వీయెచన సందర్భంగా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎల్కతుర్తి ఎస్ఐ నరసింహారావు జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ సిబ్బందికి తెలంగాణ వీయెచన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రజల సంక్షేమం కోసం జరిగిన ఉద్యమాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, స్ఫూర్తిని కాపాడుతూ ప్రజలకు సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ నరసింహారావుతో పాటు పోలీస్ సిబ్బంది, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విశ్వకర్మల జీవితాల్లో వెలుగులు నింపే నిర్ణయాలు తీసుకుంటాం

**పుస్తెలు, మెట్టెలు స్వర్ణకారులే విక్రయించే ఫైల్‌పై తొలి సంతకం**

**విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ప్రజా మంటలు):** తెలంగాణ రక్షణ సేన పార్టీని ప్రజలు ఆదరిస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే విశ్వకర్మల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చే నిర్ణయాలు తీసుకుంటామని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. పుస్తెలు, మెట్టెలు స్వర్ణకారులు మాత్రమే తయారు చేసి విక్రయించేలా చర్యలు తీసుకునే ఫైల్‌పై తొలి సంతకం చేస్తానని ప్రకటించారు.ఉప్పల్ భగాయత్ లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో కవిత పాల్గొని మాట్లాడారు. విశ్వకర్మల్లోని ఐదు వృత్తులైన మను, మయ, త్వష్ట, విశ్వజ్ఞ, శిల్పిల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా వృత్తుల్లోని కష్టాలను తాను దగ్గరుండి చూశానని, చట్టసభల్లోనూ ఈ అంశాలపై ఎన్నోసార్లు మాట్లాడానని గుర్తుచేశారు.కమర్షియల్ గోల్డ్ షాపులు పెరగడంతో స్వర్ణకారుల జీవితాలు దుర్భరంగా మారాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు సైనైడ్ తిని ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. వడ్రంగులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు శిల్పులకు దేవాలయాల కమిటీల్లో స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.విశ్వకర్మలకు భూములు ఉండవని, భూమిలేని వర్గాలకు భూమి పంపిణీ చేయాలనే ఉద్దేశంతో భూలక్ష్మీ పథకాన్ని రూపొందించామని కవిత తెలిపారు. ఈ పథకానికి మారోజు వీరన్న, ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంతాచారి స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ తనకు తండ్రి తర్వాత తండ్రి లాంటి వారని, ఆయన ఫొటో లేకుండా తమ పార్టీ కార్యక్రమం ఏదీ జరగదని అన్నారు.విశ్వకర్మల కష్టాలు తెలిసిన బిడ్డనని, తమ పార్టీకి ఆశీర్వాదం అందించాలని కవిత కోరారు. ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా 40 ఏళ్లుగా విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్న కుల పెద్దలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు.

## ప్రెస్ క్లబ్ గణనాథునికి ప్రత్యేక పూజలు

**అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్**



**జగిత్యాల, సెప్టెంబర్ 17 (ప్రజా మంటలు):** వినాయక చవితి సందర్భంగా జగిత్యాల పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన గణనాథునికి మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు.అదేవిధంగా 2వ వార్డు కౌన్సిలర్ దయాల చంద్రకళ శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణనాథుని ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని చైర్‌పర్సన్ ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు పంబాల సుజాత రామ్ కుమార్, దయాల చంద్రకళ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్ బెయిల్ కోసం రూ.10 లక్షల లంచం

**కీసర సీఐ, ఎస్సై అరెస్ట్, స్థానికుల సంబరాలు**

**నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు కీసర సీఐ రూ.10 లక్షలు డిమాండ్ చేశారు**

**డబ్బు తీసుకునే బాధ్యతను ఎస్సైకి అప్పగించారు**

**బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో ఇద్దరినీ అరెస్ట్ చేశారు**

**వారి ఇళ్లలో ఏసీబీ సోదాలు చేస్తోంది.**







మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోదాలు చేయడం కలకలం సృష్టించింది. కీసర సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఓ కేసు విషయంలో నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు సీఐ ఏకంగా రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నిందితుడితో రకరకాల పనులు చేయించుకున్నారు. కొన్ని రోజులు బిర్యానీలు, కూల్ డ్రింక్స్ తీసుకురావాలంటూ స్థాయి మరచి అధికారిన్ని దుర్వినియోగ పరచి వేధింపులకు గురి చేశారు. ఆ వేధింపులు తట్టుకోలేకపోయిన బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మరోవైపు లంచంగా డిమాండ్ చేసిన డబ్బు తీసుకునే బాధ్యతను సీఐ ఎస్సైకి అప్పగించారు. ఈ సమాచారంతో ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు.కీసర చెరువుగట్టు వద్ద గణేశుల నిమజ్జనం విధుల్లో ఉన్న ఎస్సై రూ.5 లక్షల లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి రావడం చూసిన ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి అక్కడి నుంచి వేగంగా పరుగులు పెట్టాడు. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ఏసీబీ అధికారులను ముప్పుతిప్పలు పెట్టాడు. అనంతరం పూర్తి వివరాలు తెలుసుకున్న అధికారులు ఎస్సై జ్ఞానేందర్ రెడ్డి, సీఐ ఆంజనేయులును అరెస్టు చేశారు.ఏసీబీకి పట్టుబడిన కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి ఇళ్లలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. సీఐ ఆంజనేయులు ఇంట్లో రూ.5 లక్షలు, ఎస్సై జ్ఞానేందర్ ఇంట్లో రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలనూ స్వాధీనం చేసుకున్నారు.పలు కేసుల విషయంలో లంచాల పేరుతో తీవ్రంగా వేధించేవారంటూ కీసర, బోగారం ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీబీ ట్రాప్‌పై స్పందించిన కొందరు స్థానికులు కీసర పోలీస్ స్టేషన్ ఎదుట బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పలు కేసుల విషయంలో లంచం డబ్బులు డిమాండ్ చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తున్నారు. తాజాగా ఈ ఇద్దరు పోలీస్ అధికారులు ఏసీబీకి పట్టుబడటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# గణేశ్ నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థుల మృత్యువాత

**వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యు ఒడిలోకి చేరిన ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది**

**దీంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.**





గణేశుడి నిమజ్జన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మూడో రోజు లంబోదరుడిని గంగమ్మ ఒడిలో విడిచి పెట్టేందుకు వెళ్లగా, ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఆరుగురు చనిపోయారు. సంగారెడ్డి జిల్లా పెద్దకంజర్ల గ్రామంలో వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో లోతు గుర్తించక లోనికి వెళ్లి పడిపోయారు. ముందున్న విద్యార్థి పట్టు తప్పి కుంటలోకి జారిపోగా, వినాయకుడి ప్రతిమ ఒరిగిపోయి వెనక ఉన్న వారిపై పడింది.ఈ క్రమంలో 8 మంది విద్యార్థులు చెరువులో గల్లంతయ్యారు. ఈత వచ్చిన ఇద్దరు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. మిగతా వారంతా మునిగిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చదువుకుని కుటుంబానికి ఆసరా అవుతారనుకున్న పిల్లలు విగతజీవులుగా మారడం చూసి కన్నవారు కన్నీరు మున్నీరుగా విలపించారు.మృతులను నరసింహరాజు, సుమంత్ రెడ్డి, గణేశ్, తేజ, ఉదయ్ కిరణ్, సిద్ధార్థగా గుర్తించారు. వీరందరూ శిరీష ఛారిటబుల్ ట్రస్ట్ నడుపుతున్న హాస్టల్‌లో ఉండి వివిధ విద్యా సంస్థల్లో చదువుతున్నారు. వినాయకుడి నిమజ్జన కార్యక్రమం కోసం అప్పటి వరకు ఆడిపాడిన పిల్లలు అంతలోనే కానరాని లోకాలకు పోవడంతో కన్నవారు శోక సంద్రంలో మునిగిపోయారు. తోటి విద్యార్థులు సైతం షాక్‌లో ఉన్నారు. కళ్ల ముందే స్నేహితులు మునిగిపోతున్నా ఏం చేయలేకపోయామని వాపోయారు.గణేశ్ నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గణేశ్ నిమజ్జనాల సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని గవర్నర్ సూచించారు. మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేసింది.ఈ ఘటన నన్ను తీవ్రంగా కలచి వేసింది : నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ వార్త తనను తీవ్రంగా కలచి వేసిందని అన్నారు. చిన్నారులను కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిమజ్జనాల ప్రాంతాల్లో అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా చూడాలన్నారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.విద్యార్థుల మృతి ఘటనలో హాస్టల్ వార్డెన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శిరీష ఛారిటబుల్ ట్రస్ట్ వార్డెన్ జయప్రకాశ్‌ను పటాన్‌చెరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఆరుగురు విద్యార్థుల మృతదేహాలకు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేశారు. నర్సింహరాజు, ఉదయ్ కిరణ్, శ్యామ్ కుమార్ మృతదేహాలు బంధువులకు అప్పగించగా, మరో 3 మృతదేహాలు తీసుకునేందుకు సంబంధిత కుటుంబాలు నిరాకరించాయి. ఆరుగురు విద్యార్థుల కుటుంబాలకు కలెక్టర్ రూ.2 లక్షల పరిహారం ప్రకటించగా, ముగ్గురు విద్యార్థుల కుటుంబాలు పరిహారాన్ని నిరాకరించాయి.

# ఇందిరమ్మ ఇళ్లకు అర్హులు కావలెను!

**సిటీలో పేదలే కనిపించట్లేదుగా!!**



హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఫ్లాట్ల కోసం స్థానిక నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేయకపోవడంతో ప్రజలు తమకు కావాల్సిన ప్రాంతంలో అప్లై చేసుకున్నారు. దీంతో పలు నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఇళ్లకు అర్హులను గుర్తించడం కష్టమవుతోంది. హైదరాబాద్ మహా నగరంలో 'ఇందిరమ్మ ఇళ్ల' పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం కష్టంగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న ఇళ్లకు సరిపడా స్థానిక నివాసితులు దొరక్కపోవడంతో ఆ ప్రాంతాల్లో పేదలే లేరన్న భావన కలుగుతోంది. ఖైరతాబాద్‌లోని ఇందిరమ్మ ఫ్లాట్ల కోసం ఇతర ప్రాంతాల వారిని ఎంపిక చేశారన్న ఎమ్మెల్యే దానం ఆరోపణలు క్షేత్రస్థాయి పరిశీలనలో నిజమని తేలడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.పలు దశల పరిశీలన తర్వాత లాటరీ ద్వారా ఎంపికైన వ్యక్తులు అర్హత ప్రమాణాలకు అనుగుణంగా లేరని గుర్తించిన హౌసింగ్ బోర్డు ఇప్పుడు ఆ ప్రక్రియను పునః పరిశీలిస్తోంది. 'కోర్ సిటీ'లో భాగంగా పరిగణించే ఖైరతాబాద్‌తో పాటు శివారు నియోజకవర్గమైన ఇబ్రహీంపట్నంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో నిర్మించనున్న 480 ఇళ్ల కోసం 6,970 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు సమగ్రమైన సమీక్ష నిర్వహించి 4,949 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో 600 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. 480 మందిని 'సెలెక్ట్' జాబితాలో, 120 మందిని వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచారు. అయితే తదుపరి క్షేత్రస్థాయి పరిశీలనలో కేవలం 200 మంది మాత్రమే నిజంగా అర్హులని తేలింది. మిగిలిన వారు ఇతర నియోజకవర్గాలకు చెందిన వారని తెలిసింది.నిబంధనల ప్రకారం నిర్దిష్ట నియోజకవర్గానికి చెందిన స్థానికులు మాత్రమే ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఖైరతాబాద్ ఎల్ఐజీ ఫ్లాట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో జూబ్లీహిల్స్, నాంపల్లి, అంబర్‌పేట్ ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఇక్కడ కూడా అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేపట్టి, 40 శాతం పరిశీలన పూర్తి చేశారు. ఇందులోనూ అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు ఇతర నియోజకవర్గాలకు చెందిన వారేనని తేలింది. సర్వే పూర్తయ్యే సరికి నిర్మించబోయే ఇళ్ల సంఖ్య కంటే 30 శాతం అర్హులు తక్కువగా ఉండొచ్చని సమాచారం. ఈ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్ల కోసం 1,398 దరఖాస్తులు వచ్చినప్పటికీ అప్లై చేసుకున్న వారిలో ఎక్కువ మంది ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన వారని తెలుస్తోంది.తాము నివసిస్తున్న నియోజకవర్గానికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనే విషయాన్ని ప్రజలకు అధికారులు సమర్థవంతంగా తెలియజేయడంలో విఫలమయ్యారు.మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని ప్రకటించినప్పటికీ, అక్కడి సిబ్బందికి ఈ ప్రక్రియపై తగినంత అవగాహన కల్పించలేదు.మొదటి నుంచీ నగరంలో పదేళ్లు నివాసం ఉండాలనే నిబంధనను ప్రచారం చేసినప్పటికీ, దాన్ని నిరూపించడానికి అవసరమైన నిర్దిష్ట పత్రాల గురించి మాత్రం నిరంతరం మాట మార్చుతూ వచ్చారు. ప్రారంభంలో సహాయక పత్రాలు అవసరం లేదని ప్రజా ప్రతినిధులు సభల్లో ప్రకటించారు. అధికారులు ఆధార్‌ను ప్రామాణిక రుజువుగా ఉదహరించారు. ఆ తర్వాత నగరంలో నివసిస్తున్నట్లు ధ్రువీకరించే ఏదైనా గుర్తింపు పత్రం ఉంటే చాలన్నారు.మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తుదారుడి నివాస చిరునామాతో సంబంధం లేకుండా వారికి ఇల్లు ఎక్కడ కావాలో అడిగి, ఆ నియోజకవర్గం ఆధారంగా దరఖాస్తులను పరిశీలించారు.గతంలో ఇందిరమ్మ టవర్లలోని ఫ్లాట్ల కోసం 16 నియోజకవర్గాల్లో ఏదైనా ఓ నియోజకవర్గాన్ని ఎంచుకుని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రస్తుతం ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్ లేదా చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో నివసిస్తుంటే తమ దరఖాస్తులను ఆయా ప్రాంతాలకు బదిలీ చేసుకోవచ్చని రాష్ట్ర గృహ నిర్మాణ మండలి వైస్ ఛైర్మన్ గౌతమ్ బుధవారం ప్రకటించారు. ఈ 4 నియోజకవర్గాల పరిధిలో నివసిస్తున్న అర్హులైన అభ్యర్థులు తమ ప్రస్తుత దరఖాస్తు వివరాలను http://tghb. telangana. gov.in/cure-status ద్వారా బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థి ప్రస్తుతం నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే దరఖాస్తును బదిలీ చేయవచ్చని ఆయన సూచించారు.

# పట్టభద్రుల ఎన్నికల కోసం గతంలో ఓటున్న వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి

**గ్రాడ్యుయేట్స్ ఓట్ల నమోదు కోసం ఈనెల 20న ఈసీ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది**

**నవంబర్ 6 వరకు పట్టభద్రుల ఓటరు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని ఎన్నికల కమిషన్ తెలిపింది.**

రాష్ట్రంలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు ఈసీ కసరత్తు చేపట్టింది. మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూలు ప్రకటించింది. ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్న పదవీకాలం మార్చితో ముగియనుండటంతో ఆ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు కొత్తగా ఓటర్ల జాబితా తయారు చేయనున్నారు.ఈనెల 28న పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది. నవంబరు 6 వరకు ఓటు నమోదు కోసం పట్టభద్రుల నుంచి ఫారం 8 దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబరు 25న రెండు నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. డిసెంబరు 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను ఈసీ ప్రకటించనుంది. గత జాబితాలో ఓటున్న పట్టభద్రులు కూడా మళ్లీ కొత్తగా ఫారం 8 సమర్పించాల్సిందేనని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా పోస్టుద్వారా అర్హత ధ్రువీకరణపత్రాలు జతపరిచి ఫారం 8 సమర్పించాలని సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు.




## కాఫీ తోటలు, మిరియాల పాదుల మధ్య అద్భుతం



ఆంధ్రా ఊటీ అరకులోయ అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఇక్కడి ప్రకృతి సోయగాలకు తాజాగా 'ఉడెన్ బ్రిడ్జి' (చెక్క వంతెన) అదనపు ఆకర్షణగా మారింది. పచ్చని కాఫీ తోటలు, ఆకాశాన్నంటే వృక్షాలకు అల్లుకున్న మిరియాల పాదుల నడుమ ఈ బ్రిడ్జిని సుందరంగా తీర్చిదిద్దారు. ఏడాదిన్నర క్రితం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ఉడెన్ బ్రిడ్జిని వీక్షించేందుకు పర్యాటకులు దూరప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు.ఏపుగా పెరిగిన కాఫీ, మిరియాల తోటల నడుమ సుమారు 400 అడుగుల పొడవున ఈ చెక్క వంతెనను నిర్మించారు. అడవి తల్లి ఒడిలో, పచ్చదనం మధ్య నడుచుకుంటూ వెళ్తుంటే పర్యాటకులకు సరికొత్త అనుభూతి కలుగుతోంది. భారీ వృక్షాలపైకి పాకిన మిరియాల చెట్లను చూస్తూ సందర్శకులు మరో ప్రపంచంలో విహరిస్తున్న భావన పొందుతున్నారు. నగరాల ఉరుకులు పరుగుల జీవితానికి దూరంగా, ఇక్కడి ప్రశాంత వాతావరణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ మరువలేని జ్ఞాపకాలను సొంతం చేసుకుంటున్నారు.రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ఉడెన్ బ్రిడ్జి నిర్వహణ కొనసాగుతోంది. సందర్శకులను మరింతగా అలరించేందుకు అధికారులు ఇక్కడ అనేక అదనపు ఆకర్షణలు ఏర్పాటు చేశారు. ప్రకృతి అందాలను వీక్షించేందుకు వీలుగా నిర్మించిన 'ట్రీ డెక్'పై నిల్చొని పర్యాటకులు ఉత్సాహంగా ఫొటోలు తీసుకుంటున్నారు. మరోవైపు 'ట్రీ నెస్ట్' సైతం పర్యాటకుల మది దోచుకుంటోంది. ఇందులో కూర్చొని విశ్రాంతి తీసుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు.ఉడెన్ బ్రిడ్జి వద్ద పర్యాటకుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు కల్పించారు. సందర్శకులు సేద తీరేందుకు పూర్తిగా చెక్కతో చేసిన అందమైన రెస్టారెంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ తాగునీటి సౌకర్యంతో పాటు అవసరమైన మరుగుదొడ్లను సైతం ఏర్పాటు చేశారు. అరకు అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది కాఫీ. ఈ నేపథ్యంలో, స్థానికంగా లభించే నాణ్యమైన కాఫీ బీన్స్ నుంచి స్వచ్ఛమైన కాఫీ పౌడర్‌ను తయారు చేసి పర్యాటకులకు విక్రయిస్తున్నారు.ఉడెన్ బ్రిడ్జికి పర్యాటకుల నుంచి అనూహ్య స్పందన వస్తుండటంతో అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న వంతెనకు అదనంగా, కొత్తగా మరో 200 అడుగుల మేర చెక్క వంతెనను ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు. ఈ పనులు కూడా పూర్తయితే అరకు పర్యాటకానికి మరింత శోభ చేకూరనుంది.ం

# 9 నెలల గర్భిణికి బ్రెయిన్ స్ట్రోక్

ప్రాణపాయ స్థితిలో ఉన్న గర్భిణికి సకాలంలో వైద్యం అందించి తల్లి, బిడ్డను కాపాడారు వైజాగ్ కిమ్స్ సీతమ్మధార వైద్యులు. ఇందుకు సంబంధించిన వివరాలను న్యూరో అండ్ వాస్క్యులర్ ఇంటర్వెన్షన్ విభాగం చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ వెంకటేశ్ పోతుల, కన్సల్టెంట్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ పావని మాణిక్య పాలేపుతో పాటు కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రాజాకుమార్ వెల్లడించారు.విశాఖకు చెందిన ఓ తొమ్మిది నెలల గర్భిణికి కుడివైపున పాక్షిక పక్షవాతంతో పాటు మాట కోల్పోయింది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కిమ్స్ సీతమ్మధార ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆ మహిళకు పరీక్షలు నిర్వహించగా మెదడులోని ఎడమ ప్రధాన రక్తనాళాల్లో తీవ్రమైన అడ్డంకులు కారణంగా ఇస్కీమిక్ స్ట్రోక్ వచ్చినట్లు గుర్తించాం. దీంతో ఆమెకు అత్యవసర స్ట్రోక్ చికిత్సను ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడింది.అయితే ఇక్కడే మరో సమస్య ఎదురైంది. గర్భం చివరి దశలో ఉండటంతో చికిత్స మరింత క్లిష్టంగా మారింది. తల్లి మెదడుకు రక్తప్రసరణ పునరుద్ధరించడంతో పాటు గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని కూడా నిరంతరం పర్యవేక్షించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో మందుల ఎంపిక, మోతాదు సర్దుబాటు, రక్తం గడ్డకట్టకుండా ఇచ్చే మందుల నిర్వహణ, రక్తపోటు--రక్తప్రసరణ నియంత్రణ, నాడీ సంబంధిత పరిస్థితి, శిశువు ఆరోగ్యం, ప్రసవ సమయం తదితర అంశాలపై వైద్య బృందం ఎప్పటికప్పుడు సమీక్షించింది.న్యూరో అండ్ వాస్క్యులర్ ఇంటర్వెన్షన్ విభాగం చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ వెంకటేశ్ పోతుల నేతృత్వంలోని బృందం అత్యవసరంగా మెకానికల్ థ్రాంబెక్టమీ నిర్వహించింది. గర్భస్థ శిశువుకు రేడియేషన్ ప్రభావం తగ్గేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఆమె మెదడులోని రక్తనాళంలో ఏర్పడిన గడ్డను విజయవంతంగా తొలగించడంతో పాటు టీఐసీఐ-3 స్థాయి ద్వారా పూర్తి రక్తప్రసరణను పునరుద్ధరించారు.చికిత్స సమయంలో కిమ్స్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ పావని మాణిక్య పాలేపు నేతృత్వంలోని ప్రసూతి వైద్య బృందం తల్లి ఆరోగ్యంతో పాటు గర్భస్థ శిశువు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించింది. మెదడుకు రక్తప్రసరణ పునరుద్ధరించడంతో పాటు నాడీ సంబంధిత పరిస్థితి స్థిరపడిన తర్వాత ప్రసవానికి సంబంధించి తదుపరి ప్రణాళిక రూపొందించారు. అనంతరం సిజేరియన్ నిర్వహించగా ఆరోగ్యకరమైన మగ శిశువు జన్మించాడు.గర్భధారణ సమయంలో వచ్చే పెద్ద రక్తనాళాల ఇస్కీమిక్ స్ట్రోక్ అరుదైనదే కాకుండా ప్రాణాపాయ పరిస్థితికి దారితీసే అవకాశం ఉందని డాక్టర్ వెంకటేశ్ పోతుల తెలిపారు. ముఖ్యంగా గర్భం చివరి దశలో చికిత్స అందించేటప్పుడు తల్లి మెదడుకు రక్తప్రసరణను వీలైనంత త్వరగా పునరుద్ధరించడంతో పాటు శిశువు భద్రతను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.ఇది సాధారణ స్ట్రోక్ కేసు కాదని డాక్టర్ రాజాకుమార్ పేర్కొన్నారు. ప్రధాన రక్తనాళంలో అడ్డంకిని వేగంగా గుర్తించి, మెకానికల్ థ్రాంబెక్టమీకి వెంటనే తరలించడం చాలా కీలకమైందని చెప్పారు. చికిత్సా విధానం, మందుల మోతాదు, పర్యవేక్షణ వంటి ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించామన్నారు. తల్లీబిడ్డల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని వెల్లడించారు. దాదాపు నెలలు నిండడంతో తల్లి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శిశువు ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడం తమ ముందున్న ప్రధాన బాధ్యతని డాక్టర్ పావని వివరించారు. న్యూరాలజీ, న్యూరో ఇంటర్వెన్షన్, అనస్థీషియా, ప్రసూతి విభాగాల సమన్వయంతో అత్యవసర పరిస్థితిని సురక్షితంగా ఎదుర్కొని అనంతరం ప్రసవాన్ని కూడా విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.గర్భధారణలో స్ట్రోక్ లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించడం అత్యంత కీలకమని వైద్యులు తెలిపారు. గర్భధారణ ఉన్నంత మాత్రాన అత్యవసర మెకానికల్ థ్రాంబెక్టమీకి అర్హత ఉండదని భావించాల్సిన అవసరం లేదన్నారు. తగిన పరిస్థితుల్లో, సరైన వైద్య బృందం పర్యవేక్షణలో ఈ చికిత్స ద్వారా మెదడుకు రక్తప్రసరణను పునరుద్ధరించవచ్చని వారు వివరించారు.




PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com